


.. సమస్యలపై అశ్రద్ధ
తెల్లాపూర్ మున్సిపాలిటీ అధికారులు ఆదాయ వనరులపై పెడుతున్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో మాత్రం చూపించడం లేదు. వివరాలు 8లో ▸



ఇదో రకం ఆక్రమణ
సంగారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం
జహీరాబాద్ టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జాకిర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతోందని చెప్పారు. ఆర్టీసీకి సంబంధించిన సందేహాలు, సమస్యలు, ఫిర్యాదులు, సూచనల గురించి **99592 26269** నంబర్‌కు కాల్ చేయాలని ఆయన కోరారు.

వైభవంగా వీరభద్రుడి రథోత్సవం
భారీగా తరలివచ్చిన భక్తజనం


భక్తజన సంద్రంలో వీరభద్ర స్వామి రథోత్సవం

జిన్నారం (పటాన్‌చెరు): జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రం బొంతపల్లి భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టం భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దివ్య రథోత్సవాన్ని మంగళవారం అర్ధరాత్రి 12:30 గంటలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గుప్తాల ఆధ్వర్యంలో శైవ ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులు పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులను విభిన్న పూలతో అలంకరించిన రథంలో ప్రతిష్ఠించారు. అనంతరం వీరన్నగూడెం వీధుల్లో భక్తులు రథాన్ని లాగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, అర్చక బృందం, భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీతోనే సమస్యల పరిష్కారం
ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి స్పష్టం చేశారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో బుధవారం కిర్బీ ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో నరసింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. కిర్బీ పరిశ్రమలో వచ్చే గుర్తింపు కార్మికసంఘం ఎన్నికల్లో పరిశ్రమలో ఉన్న ఇతర కార్మిక సంఘాల నాయకులను, కార్మికుల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నిస్తామన్నారు. త్వరలో కార్మికులతో సర్వసభ్య సమావేశం నిర్వహించి, కార్మికుల మద్దతు కూడగడతామని తెలిపారు.

ఘనంగా మహనీయుల జయంత్యుత్సవాలు
అదనపు కలెక్టర్ మాధురి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సంగారెడ్డి జోన్: ప్రతీ గ్రామంలో మహనీయుల జయంత్యుత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ మాధురి తెలిపారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో మహనీయుల జయంత్యుత్సవాల సందర్భంగా సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలె మహనీయుల జయంత్యుత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారి అఖిలేష్ రెడ్డి ,వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రామాచారి, ఎస్సీ ,ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మా ప్రాంతాన్ని కలుషితం చేయొద్దు
జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 50వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి మున్నూరు కాపు సంఘం వినతి పత్రాన్ని అందజేసి రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ...డంపు యార్డ్ ఇక్కడ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం పూర్తిగా కలుషితంగా మారి పచ్చని పంట పొలాలు అటవీ ప్రాంతం నాశనమవుతాయన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అత్యంత బాధాకరమన్నారు.

విషాద వలసగీతం

- ప్లేగు వ్యాధితో తలోదిక్కుకు వలసపోయిన గ్రామస్తులు
- కుప్పానగర్, మేదపల్లి గ్రామాలలో నివాసం
- సాక్ష్యాలుగా మిగిలిన ఆంజనేయస్వామి విగ్రహం, దర్గా..
- ఊరితో పేగుబంధాన్ని తెంచిన ప్లేగు వ్యాధి
- రెవెన్యూ ఆదాయం గినియర్‌పల్లికి

ఇళ్లు, జనాలు లేని రాంపూర్


ఇళ్లు లేకపోవడంతో బీడుగా మారిన స్థలాలు

ఒకప్పుడు లేలేత భానుడి కిరణాలతో మేల్కొనే గ్రామం...వ్యవసాయ పనులకెళ్లే జనాలతో, వంటింటి పనులు చేసుకునే మహిళలతోనూ, ఆడి పాడే పిల్లాపాపలు, పశుపక్ష్యాదులతోనూ నిత్యం జన సంచారంతో సందడిగా ఉండేది. ఇదంతా కొన్ని దశాబ్దాల క్రితం. కానీ, ఇప్పుడా పల్లెసీమ చరిత్రకు ఆనవాళ్లే పోయింది. ఇప్పుడా ఊళ్లో ఇళ్లూ లేవు...అందులో జనాలూ లేరు. నాడు మహమ్మారిగా పేరొందిన ప్లేగు వ్యాధి ఊరిని కబళించడంతో భయంతో తలోదిక్కుకూ వలస వెళ్లిపోయారు. రెవెన్యూ రికార్డుల్లోనూ, చరిత్రపుటల్లోనూ మాత్రమే మిగిలిపోయిన ఝరాసంగం మండలానికి చెందిన ఆ ఊరి పేరు రాంపూర్. ఈ గ్రామానిది ఓ విషాద వలసగీతం.

సాక్షి పరిశీలన

సంగారెడ్డిజోన్: రాంపూర్‌లో వ్యవసాయ భూములు, పాడుబడిన ఇళ్ల పునాదులు, ఓ గుడి, దర్గా మాత్రమే ఉన్నాయి. ఇక రెవెన్యూ రికార్డుల్లో మాత్రం వ్యవసాయభూములు, వాటి సర్వే నంబర్లు మాత్రమే కనిపిస్తాయి. 90 ఏళ్ల క్రితం 30 నుంచి 40 కుటుంబాలు సుమారు 200 మంది వరకు నివాసం ఉండేవారు. అప్పట్లో ప్లేగు మహమ్మారి వ్యాధితో గ్రామంలో చాలామంది మృత్యువాత పడ్డారు. దీంతో సరైన వైద్యం, వైద్య సదుపాయాలు లేక భయాందోళనకు గురైన గ్రామస్తులు ఇతర గ్రామాలకు వలస వెళ్లిపోయారు. ఇందులో ఎక్కువమంది ఇదే మండలంలోని కుప్పానగర్, మేదపల్లి గ్రామాల్లో నివాసం ఉంటున్నారు.

17 సర్వే నంబర్లు.. 351.09 ఎకరాల భూమి

రాంపూర్ గ్రామంలో జనం లేకపోయినప్పటికీ అక్కడి ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన వారు భూములను సాగు చేసుకుంటూ పంటలు పండిస్తున్నారు. ప్రతీ రోజు నివాసం ఉంటున్న గ్రామాల నుంచి వెళ్లి పనులు చేసుకుని వస్తుంటారు. రెవెన్యూ (ధరణి) ప్రకారం రాంపూర్ గ్రామం పేరుతో 17 సర్వే నంబర్లు 351.09 ఎకరాల భూముల వివరాలు అందుబాటులో ఉన్నాయి.

ఆదాయం గినియర్‌పల్లికి

రాంపూర్ గ్రామ రెవెన్యూ ఆదాయం ఇదే మండలంలోని గినియార్‌పల్లి గ్రామానికి సమకూరుతోంది. గ్రామంలో భూముల అమ్మకాలు, కొనుగోలు జరిగినా వాటి ద్వారా వచ్చే ఆదాయం గినియార్‌పల్లికి చేరుతుంది. రాంపూర్‌లో ఉన్న ఒక కంకర్ క్రషర్ వల్ల వచ్చే ఆదాయం కూడా గినియార్‌పల్లికే చెల్లిస్తున్నారు. గతంలో ఏదైనా రెవెన్యూ రికార్డులు అవసరం ఉంటే కుప్పానగర్ గ్రామ వీఆర్‌వో ఇచ్చేవారని రాంపూర్ గ్రామస్తులు చెబుతున్నారు.

అనుసంధానంగా కుప్పానగర్

రాంపూర్ గ్రామానికి కుప్పానగర్ అనుసంధానంగా ఉండేది. వ్యవసాయ భూములు ఇక్కడి శివారులో ఉన్నప్పటికీ సంబంధం లేని గినియార్‌పల్లికి రెవెన్యూ ఆదాయం ఎందుకు సమకూరుతుందో అర్థం కావటం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని కుప్పానగర్‌కు మళ్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రాంపూర్-బిడెకన్నె గ్రామాల మధ్య ఉన్న శ్రీసిద్ధేశ్వర ఆలయం

రాంపూర్ గ్రామ వివరాలు

అప్పట్లో ఉన్న కుటుంబాలు	30-40
జనాభా	200(సుమారు)
సర్వే నంబర్లు	17
సాగులో ఉన్న భూమి	351.09 ఎకరాలు

మా తాతల కాలం నుంచి నివాసం



మా తాతల కాలం నుంచి కుప్పానగర్ గ్రామంలోనే నివాసం ఉంటున్నాం. అప్పట్లో రాంపూర్ గ్రామం నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నాం. ప్లేగు వ్యాధి రావటంతో భయాందోళనతో గ్రామాన్ని వదిలి వచ్చినట్లు పెద్దలు చెప్పేవారు.

-రాంపూర్ మచ్కూరి రాజమహ్మద్, కుప్పానగర్

రెవెన్యూ ఆదాయం మళ్లించాలి



రాంపూర్ గ్రామ రెవెన్యూ ఆదాయం గినియార్‌పల్లికి సమకూరుతుంది. అన్ని వసతులతోపాటు దగ్గరగా ఉండే కుప్పానగర్ గ్రామానికి రెవెన్యూ ఆదాయం మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. గతంలో రెవెన్యూపరంగా ఏదైనా అవసరం ఉంటే కుప్పానగర్ గ్రామ వీఆర్‌వో ఇచ్చేవారు. అక్కడికి వెళ్లే రహదారులను అభివృద్ధి చేయాలి.

-రాంపూర్ ప్రకాశ్, కుప్పానగర్

సాక్ష్యాలుగా ఆంజనేయస్వామి విగ్రహం, దర్గా


శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం


రాంపూర్‌లో ఉన్న దర్గా

ప్రస్తుతం జనావాసం లేని ఆ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం, గైబ్ సాహెబ్ దర్గాతో పాటు ఇళ్లకు సంబంధించిన పునాదిరాళ్లు నాటి గ్రామానికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. అక్కడ ఉన్న స్వామి వారి విగ్రహానికి అప్పుడప్పుడు పూజలు, దర్గా వద్ద ఏడాదికొకసారి ప్రార్థనలు చేస్తున్నారు. రాంపూర్‌కు బిడెకన్నె గ్రామానికి మధ్య గుట్టపై శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇక్కడ నిత్య పూజలు చేస్తుంటారు. పలు సినిమాల షూటింగ్‌లు సైతం జరిగాయి.

మహిళల భద్రతకు కట్టుబడి ఉన్నాం
ఎస్పీ పరితోష్ పంకజ్



మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్ పంకజ్

పటాన్‌చెరు టౌన్: జిల్లాలోని మహిళా ఉద్యోగుల భద్రతకు కట్టుబడి ఉన్నామని ఎస్పీ పరితోష్ పంకజ్ స్పష్టం చేశారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఐలా కార్యాలయంలో బుధవారం సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో పరిశ్రమల భద్రత, ట్రాఫిక్ సమస్యల నివారణకు ఏర్పాటు నిర్వహించిన సమావేశంలో ఎస్పీ పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో పరిశ్రమల భద్రతా, పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల భద్రతకు కట్టుబడి ఉన్నామని, వారికి భద్రత కోసం షి-షటిల్ పేరుతో బస్సుల నడుపుతున్నామని, త్వరలోనే మరిన్ని బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. పరిశ్రమల భద్రత దృష్ట్యా ప్రతి కంపెనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సరైన గుర్తింపు కార్డులు ఉన్న వారికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని సూచించారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం పరిశ్రమలకు చెందిన వాహనాల డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించాలని ఆదేశించారు. భారీ వాహనాలు రాత్రి సమయంలోనే అనుమతించాలని సూచించారు. సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ బలోపేతానికి అన్ని పరిశ్రమలు ముందుకు రావాలని కోరారు. పరిశ్రమలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పారిశ్రామికవాడలలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి త్వరలో ట్రాఫిక్ మార్షల్స్‌ను నియమిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, ట్రెజరర్ రమణారెడ్డి, ఐలా వైస్ చైర్మెన్ రాఘవరెడ్డి, ఐలా ట్రెజరర్ రాజు, వివిధ ఫార్మా, ఇంజనీరింగ్ కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలు, సీఐలు వినాయక్ రెడ్డి, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి సస్పెన్షన్

- మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు
- కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశం

సంగారెడ్డి జోన్/జహీరాబాద్ టౌన్: విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతోపాటుగా ఆసుపత్రికి వచ్చిన గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నట్లు విచారణలో తేలడంతో జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డా.అఙ్మనాజ్‌ను విధులనుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి తొలగించారు. ఈమెతోపాటుగా దౌల్తాబాద్, మల్చల్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇద్దరు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు అందించాలని జిల్లా వైద్యాధికారి డా.గాయత్రీదేవిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం మాతాశిశు సంరక్షణ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు క్రమం తప్పకుండా గర్భిణులను పరిశీలించి వారికి తగిన సూచనలు సలహాలు అందించి, పౌష్టికాహారం, మందులు వాడేలా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో 2023 -24 సంవత్సరం పోల్చితే 2024-25 సంవత్సరంలో మాతా శిశు మరణాలు 50% తగ్గినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్లను ప్రతీ నెల తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు. సక్రమంగా లేని ఆస్పత్రులను సీజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా.గాయత్రీదేవి, సీనియర్ జడ్జి రమేశ్, అదనపు ఎస్పీ సంజీవరావు, రెడ్ క్రాస్ చైర్మన్ వనజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సర్వే డబ్బులు చెల్లించాలి: ఎస్‌జీటీ

ఆర్థిక, సామాజిక సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రావాల్సిన రెమ్యూనరేషన్ ఇంతవరకు చెల్లించలేదని, నిధులు విడుదల చేయాలని ఎస్‌జీటీ నాయకులు కలెక్టర్ కాంత్రిని కోరారు. ఈ మేరకు ఎస్‌జీటీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఆకుల ప్రభాకర్, నిమ్మల కిష్టయ్యలు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

త్వరలో తహసీల్దార్ల బదిలీలు!

- నెలాఖరులోపు ఉత్తర్వులు!
- నెల క్రితమే ఆప్షన్లు తీసుకున్న రెవెన్యూశాఖ
- కీలక మండలాల్లో పోస్టుల కోసం ఉవ్విళ్లు!



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఎన్నికల బదిలీల్లో భాగంగా వివిధ జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు తిరిగి జిల్లాకు రానున్నారు. రెవెన్యూ శాఖ వర్గాల్లో దీనిపై జోరుగా చర్చ జరుగుతోంది. ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో పనిచేసిన తహసీల్దార్లు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్ వంటి జిల్లాలకు తహసీల్దార్లు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఇక్కడి నుంచి సుమారు ఏడాదిన్నర కాలంగా వీరంతా ఆయా జిల్లాల్లోనే పనిచేస్తున్నారు. వీరిలో చాలామంది సొంత జిల్లాకు వచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో బదిలీలు కోరుకునే తహసీల్దార్ల నుంచి ఆప్షన్లు కూడా తీసుకున్నారు. ఈ తహసీల్దార్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఈ నెలాఖరులోపు ఉత్తర్వులు వచ్చే అవకాశాలున్నాయని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలోనూ ఇలాగే త్వరలోనూ ఉత్తర్వులు వెలువడుతాయని పలుమార్లు చర్చ జరిగినా బదిలీ ఉత్తర్వులు మాత్రం రాలేదు.

స్థానిక సంస్థల ఎన్నికలయ్యే వరకు..

స్థానిక సంస్థల ఎన్నికలయ్యే వరకు తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపే అవకాశాలు లేవని గతంలో చర్చ జరిగింది. చాలామంది తహసీల్దార్లు గత ప్రభుత్వ పెద్దలతో సన్నిహిత సంబంధాలను కొనసాగించారు. వీరంతా తిరిగి జిల్లాకు చేరుకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవనే భావనతో ప్రభుత్వ పెద్దల్లో ఉన్నట్లు చర్చ జరిగింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు మరికొన్ని నెలలు పట్టే అవకాశం ఉండటంతో ఇప్పుడు తహసీల్దార్ల బదిలీలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆశాఖ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఆ పోస్టులకు భలే డిమాండ్..

జిల్లాలో కొన్ని మండలాల తహసీల్దార్ల పోస్టులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ప్రధానంగా పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల పరిధిలోని తహసీల్దార్ పోస్టుల కోసం కొందరు ఉవ్విళ్లురుతున్నారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ఆయా మండలాల్లో పనిచేసిన కొందరు పెద్ద ఎత్తున అక్రమార్జనకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ధరణిని అడ్డం పెట్టుకుని ప్రభుత్వం భూములను నేతలు, బడా బాబులకు కట్టబెట్టడం వెనుక రూ.కోట్లు, అలాగే వారసులు లేని భూములను వందల ఎకరాల్లో పట్టాలు చేసి అందినకాడికి దండుకున్నారనే ఆరోపణలు వినిపించాయి. ఇలా అక్రమార్జనకు వీలున్న మండలాల్లో తిరిగి పోస్టింగ్ దక్కించుకునేందుకు కొందరు తహసీల్దార్లు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేతలతో సన్నిహిత సంబంధాలు నెరపిన కొందరు తహసీల్దార్లు ఇప్పుడు కూడా అధికార పార్టీ ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకుని ఈ కీలక పోస్టులను దక్కించుకునేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నట్లు రెవెన్యూశాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో కీలక మండలాల్లో పనిచేసిన తహసీల్దార్లకు అవే మండలాల్లో పోస్టింగ్‌లు దక్కుతాయా? లేక వీరిని మారుమూల మండలాలకు పోస్టింగ్ ఇస్తారా అనేదానిపై స్పష్టత రావాలంటే ఉత్తర్వులు వెలువడే వరకు వేచి చూడాల్సిందే.

అల్బెండజోల్.. ఆలస్యమేనా?

- మాత్రల పంపిణీలో జాప్యం
- గత నెల 10న అందించాలని ఏర్పాట్లు
- అనివార్య కారణాలతో నిలుపుదల
- 45 రోజులు దాటినా స్పష్టత కరువు
- జిల్లాలో 4,05,207 మంది పిల్లల గుర్తింపు

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): నులిపురుగుల నివారణకు ప్రతి ఏటా ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్నవారికి అల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. కానీ, ఈ ఏడాది వీటి పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత నెల 10న మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా అవి సరఫరా కాకపోవడంతో పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఇప్పటికీ 45రోజులు దాటినా మళ్లీ ఎప్పుడు పంపిణీ చేస్తారనే దానిపై స్పష్టత కరువైంది. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నులిపురుగుల (నట్టల) నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

జిల్లాలో 4లక్షలకు పైగా పిల్లలు

జిల్లాలో 119 ఏళ్లలోపు 4,05,207 పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకుగాను సంబంధించి జిల్లాలోని ఏఎన్‌ఎంలకు, ఆశా వర్కర్లకు, వైద్య సిబ్బంది ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహించి మాత్రలు వేసే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు శిక్షణ సైతం ఇచ్చారు.



అల్బెండజోల్ మాత్రలు

నాణ్యత లేకపోవడమే కారణమా..!

పిల్లలకు పంపిణీ చేయాల్సిన అల్బెండజోల్ మాత్రలు నాణ్యతగా లేకపోవడమే కారణంగా తెలుస్తోంది. అల్బెండజోల్ మాత్రలు నాణ్యత పరీక్షలో విఫలం కావడంతో ప్రభుత్వం వాటిని వెనక్కి పంపించినట్లు అధికారులు చెబుతున్నారు.

వయస్సును బట్టి మాత్ర..

ఒకటి నుంచి రెండేళ్ల పిల్లలకు సగంమాత్ర స్పూన్ ద్వారా పొడి చేసి నీటిలో వేయాలి. దీనిని మధ్యాహ్న భోజనం తర్వాత వేయాల్సి ఉంటుంది. 2 నుంచి 3 ఏళ్ల పిల్లలకు ఒక పూర్తి మాత్ర పొడిచేసి వేయాలి. 3 నుంచి 19 సంవత్సరాల వారికి చప్పరించి లేదా నమిలి మింగేటట్లు చూడాలి.

అపరిశుభ్రత వల్లే నులి పురుగులు

చేతులు శుభ్రం చేసుకోకుండా ఆహారాన్ని తినడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం, అపరిశుభ్రమైన పరిసరాల వల్ల ఇది వ్యాప్తి చెందుతుంది. దీనిని నివారించేందుకు షూ ధరించడం, భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ఆహార పదార్థాలపై మూతలు పెట్టాలి. వీధుల్లో విక్రయించే ఆహారాన్ని తినకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. చేతి గోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి.

నులి పురుగులతో అనేక అనర్థాలు

నులి పురుగులతో పిల్లలకు అనేక అనర్థాలు కలుగుతాయి. ఇవి పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు. వీటి ద్వారా శరీరంలో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరేచనాలు, బరువు తగ్గడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయి.

పిల్లలపై ప్రభావం..
నులి పురుగులతో పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, రోగనిరోధక శక్తి తగ్గిపోవడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, బలహీనంగా మారడం, కడుపునొప్పి, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీంతోపాటు శారీరక, మానసిక పెరుగుదల తగ్గిపోతుంది. విద్యార్థుల్లో ఏకాగ్రత తగ్గిపోతుంది. అల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా వీటిని నిర్మూలించవచ్చు. రక్తహీనతను నియంత్రించడమేగాక వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది.

మాత్రలు సరఫరా కాలేదు
అల్బెండజోల్ మాత్రలు సరఫరా కాకపోవడంతో గత నెల 10న నిర్వహించాల్సిన కార్యక్రమం వాయిదా పడిన మాట వాస్తవమే. జిల్లాకు సుమారు 4.5లక్షల మాత్రలు అవసరం ఉంది. ప్రభుత్వం నుంచి మాత్రలు రాగానే పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

-శశాంక్ దేశ్ పాండే,జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి,సంగారెడ్డి

దెబ్బతిన్న పంటల పరిశీలన


వర్షాలకు దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ నవీన్‌కుమార్

జహీరాబాద్: కోహీర్ మండలంలో కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. బుధవారం మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ మండల కేంద్రమైన కోహీర్‌తోపాటు మండలంలోని సజ్జాపూర్, ఖానాపూర్, బడంపేట, మాచిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో సాగులో ఉన్న నేలవాలిన, దెబ్బతిన మొక్కజొన్న, జొన్న పంటల వివరాలను సేకరించారు. పంటలు ఏ మేరకు దెబ్బతిన్నాయనే విషయాన్ని మండలంలోని ఖానాపూర్ గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించనున్నట్లు ఏఓ పేర్కొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు పూలే విద్యార్థినులు


శ్రీజ


నవ్య

వర్గల్(గజ్వేల్): వికసిత్ భారత్ నేషనల్ యూత్ పార్లమెంట్ రాష్ట్రస్థాయి పోటీలకు వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇటీవల సిద్దిపేటలో 'ఒక దేశం–ఒక ఎన్నిక' అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గురుకుల కళాశాలకు చెందిన ఫైనలియర్ విద్యార్థినులు పుప్పాల శ్రీజ, గంగుల నవ్య చక్కని ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. వీరికి హైదరాబాద్ అసెంబ్లీ సమావేశంలో పాల్గొని మాట్లాడే అరుదైన అవకాశం లభించనుందని తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తోపాటు ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ రాధారాణి, భాగ్యలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

మహిళలతో అసభ్యకర ప్రవర్తన
– ఇద్దరు రిమాండ్


నిందితులను చూపుతున్న సీఐ నాగరాజు

మెదక్ మున్సిపాలిటీ: మద్యం మత్తులో మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరిని పట్టణ పోలీసులు అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ నాగరాజు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన ఇద్దరు మహిళలు మంగళవారం రాత్రి పాత బస్టాండ్ వద్ద నుంచి స్కూటీపై వెళ్తున్నారు. మద్యం మత్తులో బైక్‌పై వెళ్తున్న మెదక్ పట్టణానికి చెందిన ప్రదీప్‌కుమార్, గిరికల మహేశ్ కుమార్ మహిళల పక్క నుంచి వెళ్తూ అసభ్యకరంగా ప్రవర్తించారు. పక్కన ఉన్న వారు వారించే ప్రయత్నం చేసినా వినలేదు. బాధిత మహిళలు నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరిపై పోక్సో కేసు

కొమురవెల్లి(సిద్దిపేట): రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసిన ఘటన కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం చేర్యాల సీఐ శ్రీను కథనం మేరకు.. మండలంలోని వేచరేణి గ్రామానికి చెందిన దినేష్, చేర్యాల పట్టణానికి చెందిన రాములు ఇద్దరు మైనర్ల పట్ల దురుసుగా ప్రవర్తించారు. బాధితుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

యువకుడు గల్లంతు

మనోహరాబాద్(తూప్రాన్): చెరువులో యువకుడు గల్లంతమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మండలంలోని రంగాయపల్లి గ్రామానికి చెందిన మన్నె అజయ్‌కుమార్ (26) చేపలు పట్టడానికి గ్రామ చెరువులోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. గ్రామస్తులతో గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం మరోసారి గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆదాయంపై శ్రద్ధ.. సమస్యలపై అశ్రద్ధ

సాక్షి పరిశీలన


తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం

తెల్లాపూర్ మున్సిపాలిటీ
- అస్తవ్యస్తంగా పాలన.. రోడ్లపై చెత్త కుప్పలు
- సమస్యలను పట్టించుకోని అధికారులు
- జోరుగా అక్రమ నిర్మాణాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం పూర్తికావడంతో ప్రత్యేక అధికారుల పాలన వచ్చిన ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మున్సిపాలిటీకి ఆదాయ వనరులను సమకూర్చడంపైనే అధికారులు దృష్టి పెడుతున్నారు తప్ప అందులో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. రహదారులపైనే చెత్తకుప్పలు, డ్రైనేజీ నీరు పూడికతీత లేక పొంగిపొర్లుతుండటం, పలు కాలనీలకు చెందిన మురుగునీరు చెరువులోకి చేరుతుడటం వంటి సమస్యలు ప్రజల్ని వేధిస్తున్నా అధికారులకు కంటికి మాత్రం కనిపించడం లేదు.

తెల్లాపూర్ మున్సిపల్ వివరాలు

తెల్లాపూర్ మున్సిపల్ ఏర్పాటు	2018
పట్టణంలోని వార్డులు	17
జనాభా	11,742 (2011 ప్రకారం) ప్రస్తుతం 2 లక్షలపైగా
రెవెన్యూ జోన్‌లు	5
ఇళ్ల సంఖ్య	42,298
అవసరమైన తాగునీరు	11 ఎంఎల్‌డీ
చెత్త సేకరణ వాహనాలు	27
పబ్లిక్ టాయిలెట్స్	5
విద్యుత్ దీపాలు	4,24,621
మహిళా గ్రూపులు	379
పారిశుద్ధ్య కార్మికులు	150

రోడ్లపై చెత్త కుప్పలు



తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని రేడియల్ రోడ్లపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పలు వార్డులలో సైతం రోడ్లపై చెత్త వేసి తగలబెడుతున్నారు. విద్యుత్‌నగర్ నుంచి తెల్లాపూర్ మార్గంలో, కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ సమీపంలోని రేడియల్‌పై, ఈదులనాగులపల్లి గ్రామ ముఖద్వారం, వెలిమెల, కొల్లూరు, విద్యుత్‌నగర్ ముత్తంగి, రోడ్ల పక్కల పెద్ద ఎత్తున చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.

అస్తవ్యస్తంగా చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరులో ఐదెకరాల్లో రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌ను అధికారులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదు. పొడి,తడి చెత్తను వేరు చేయకుండా ముత్తంగి, వెలిమెల, అనేక ప్రాంతాలలో చెత్తను తగలబెడుతున్నారు.

అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్

గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.2కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు స్థలంను కేటాయించి పనులు మొదలుపెట్టారు. కానీ, కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ నిధులను నిలిపివేయడంతో ఇంటిగ్రేటెట్ మార్కెట్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

ప్రారంభానికి నోచుకోని కల్యాణ మండపం



తెల్లాపూర్ మున్సిపల్ ప్రజల కోసం సుమారు రూ.7 కోట్లతో నిర్మించిన ఆధునిక కల్యాణమండపం అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ గ్రూపుల తగాదాలతో ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేకపోయింది.


పాత మున్సిపల్ కార్యాలయం వద్ద విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న సీసీ కెమెరాలు

పనిచేయని సీసీ కెమెరాలు

తెల్లాపూర్, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో విద్యుత్‌నగర్ కాలనీలలో సుమారు 300 సీసీ కెమెరాలున్నాయి. కానీ అందులో సుమారు 200పైగా సీసీ కెమెరాలు పనిచేయడంలేదు.

అక్రమ నిర్మాణాలకు అండగా

నూతనంగా మున్సిపల్‌లో విలీనమైన గ్రామాల పరిధిలో అధికారుల అండతో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.


అస్తవ్యస్తంగా రోడ్డు

రోడ్లపై మట్టి

తెల్లాపూర్‌లో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రేడియల్ రోడ్డుపై పెద్ద ఎత్తున మట్టి కుప్పలున్నా వాటిని తొలగించిన పాపానపోవడం లేదు. దాంతో కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు.

వెలగని దీపాలు

మున్సిపల్ పరిధిలోని పలుచోట్ల రోడ్లపై విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రిసమయంలో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. తెల్లాపూర్‌లోని మైఫేర్, రేడియల్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాలలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు.

చెరువులోకి మురుగునీరు


మురుగు నీటితో వనం చెరువు

కొన్నేళ్లుగా శేరిలింగంపల్లి నలగండ్ల ప్రాంతాలకు చెందిన మురుగునీరు చెరువులోకి చేరుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెరువులు పూర్తి కాలుష్యమవుతున్నాయి.


ముత్తంగిలో రోడ్డ పక్కన తగులబెట్టిన చెత్త

ఆసుపత్రికి స్థలం కేటాయించినా...

జనాభాకు సరిపడా ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తెల్లాపూర్‌లో 30పడకల ఆసుపత్రిని మంజూరు చేసి అందుకు కావాల్సిన స్థలాన్ని సైతం కేటాయించింది. కానీ, పనులను మాత్రం ప్రారంభించడం లేదు.

రోడ్లపై డ్రైనేజీ నీరు



తెల్లాపూర్ నుంచి ఉస్మాన్‌నగర్ వెళ్లే మార్గంలో డ్రైనేజీ నీరు పెద్ద ఎత్తున రేడియల్ రోడ్డుపైకి వస్తున్నాయి. ముత్తంగి న్యూటన్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

దోమలతో ఇబ్బందులు పడుతున్నాం



దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. దోమల నివారణకు అధికారుల ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. చెత్త సేకరణ కూడా సరిగా లేదు. ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది.

– సురేశ్, తెల్లాపూర్

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయండి



సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఈ ప్రాంతంలో నిర్మాణాలు కారణంగా నిత్యం కొత్తవారు వస్తుంటారు. సీసీ కెమెరాలు ఉంటే ఎంతో ఉపయోగం. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– రాజిరెడ్డి, తెల్లాపూర్

నిత్యం అందుబాటులో ఉంటున్నాం



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉంది. రోడ్డుపై చెత్త వేసేవారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

చికిత్స పొందుతూ యువకుడు మృతి


కుమార్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన కుమార్(28) పంచాయతీ కార్యాలయంలో తాత్కాలిక కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తనకు వచ్చే కొద్దిపాటి వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వేతనం సరిపోక సమయానికి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో మనస్తాపం చెంది 21న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా వెంటనే జోగిపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైద్రాబాద్ ఉస్మానియాకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తమ్ముడు పోచయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాంచంద్రాపూర్‌లో మరో యువకుడు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సుంకరి నాగయ్య గొర్రెల కాపరిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు సుంకరి ప్రశాంత్(19) కొద్దిరోజులుగా ఏం పని చేయకుండా ఖాళీగా ఇంట్లో ఉంటున్నాడు. దీంతో తండ్రి మందలించాడు. మనస్తాపానికి గురైన ప్రశాంత్ వారం రోజుల కిందట క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

న్యూమోనియాతో బాధపడుతూ నాలుగేళ్ల చిన్నారి


మాన్విత

సిద్దిపేటజోన్: న్యూమెనియాతో బాధపడుతున్న నాలుగేళ్ల పాప ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. సిద్దిపేట పట్టణానికి చెందిన శ్రీకాంత్ చారి, స్వాతిల ఏకైక కుమార్తె మాన్విత(4) 12 రోజుల కిందట అస్వస్థతకు గురికాగా స్థానిక సందీప్ చిల్డ్రన్ ఆస్పత్రిలో చేర్పించారు. నాటి నుంచి న్యూమోనియాతో బాధపడుతూ చికిత్స పొందుతుంది. బుధవారం అకస్మాతుగా పాప పరిస్థితి విషమించి మృతి చెందింది. ఇంజక్షన్ ఇచ్చిన కొద్ది నిమిషాల్లోనే పాప పరిస్థితి విషయంగా మారి చనిపోయిందని, వైద్యుల నిర్లక్ష్యం కారణంతోనే పాప చనిపోయిందని బంధువులు ఆరోపించారు. పాపను కాపాడేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, ఇందులో మా నిర్లక్ష్యం ఏమిలేదని ఆసుపత్రి నిర్వహకులు పేర్కొన్నారు. ముందు జాగ్రత్తగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దు:ఖం దిగమింగి.. పరీక్ష రాసి


పరీక్ష రాసిన కావ్యశ్రీ

నిజాంపేట(మెదక్): తండ్రి మరణించిన బాధను దిగమింగుకొని విద్యార్థిని పరీక్షకు హాజరైంది. ఈ ఘటన మండలంలోని నస్కల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సత్యం (48) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కూతుర్లు ఉండగా.. రెండో కూతురు కావ్యశ్రీ కామారెడ్డి జిల్లా జంగంపల్లిలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. తండ్రి గుండెపోటుతో మృతి చెందాడని ఉదయమే సమాచారం రావడంతో తోటి విద్యార్థులు ఓదార్చారు. పరీక్ష రాసేలా ధైర్యం చెప్పారు. కావ్యశ్రీ గణిత శాస్త్రం పరీక్ష రాసి నస్కల్ గ్రామంలోని తండ్రి అంత్యక్రియలకు హాజరైంది.

నకిలీ ఔషధాలు తయారు చేయడం లేదు

- సీఎంఓ ద్వారా చట్టబద్ధంగా ధ్రువీకరించారు
- జోడాస్ పరిశ్రమ హెచ్ఆర్ శ్రీకాంత్


ధ్రువీకరణ పత్రాలను చూపుతున్న పరిశ్రమ ప్రతినిధులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని కర్కపట్లలో ఉన్న జోడాస్ ఎక్స్ పోయిమ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో నకిలీ ఔషధాలు తయారు చేయడం లేదని జోడాస్ పరిశ్రమ హెచ్ఆర్ శ్రీకాంత్, నూకరాజు తెలిపారు. బుధవారం పరిశ్రమలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఔషధాల ప్యాకింగ్ కవర్లపై రష్యా భాషలో ముద్రించడంతో కొంతమంది బాహ్య వాటాదారులు నకిలీ మందులు పంపిణీ చేస్తున్నారని నకిలీ ఔషధ పంపిణీ కేసుగా చిత్రీకరించారన్నారు. ఈ సమస్య రష్యాలో విస్తరించడంతో ఔషధ పంపిణీ విషయంలో తమ పరిశ్రమకు చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పరిశ్రమ యజమానులు తమ నివేదికలను డీసీఏ తెలంగాణకు సమర్పించారని వెంటనే వాటిని డ్రగ్ కంట్రోల్ అధికారులు పరిశీలించి కాంట్రాక్ట్ మాన్యు ఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్(సీఎంఓ) ద్వారా చట్టబద్ధంగా తయారు చేయబడ్డాయని స్పష్టం చేశారన్నారు. అందుకు గాను ధ్రువీకరణ పత్రాలను అధికారులు బుధవారం అందించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించిన ఔషధాలను మాత్రమే తయారు చేసి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

బేస్ బాల్‌లో క్రీడాకారిణి ప్రతిభ

మిరుదొడ్డి(దుబ్బాక): నాల్గో అంతర్జాతీయ విమెన్ బేస్ బాల్ ఆసియా కప్ క్వాలిఫయర్‌కు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లికి చెందిన పోసాన్‌పల్లి కవిత ప్రతాప్ దంపతుల కూతురు సౌమ్య ఎంపికైంది. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో వచ్చే నెల 23 నుంచి 29 వరకు జరిగే క్వాలిఫయర్ పోటీల్లో పాల్గొననుంది. సౌమ్య ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా సౌమ్యను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. థాయ్‌లాండ్ వెళ్లడానికి ఆర్థిక స్థోమత లేని ఆమెకు విమాన ఛార్జీలతో పాటు, తదితర ఖర్చులకు ఆర్థిక సాయం అందజేస్తానని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచం యాదగిరి, ప్రతాప్‌రెడ్డి, సిద్ధా రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నిండా ముంచిన నకిలీ మందులు

- ఎర్రబడుతుందని పిచికారీ చేస్తే ఎండిపోయింది
- ఆరు ఎకరాల పంట నష్టపోయాయని ఓ రైతు ఆవేదన


వరిని, మందులను చూపుతున్న రైతు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పంట ఎర్రబడుతుందని, దోమకాటు రక్షణకు మందులను పిచికారీ చేస్తే ఉన్న వరి పంట ఎండుముఖం పట్టింది.. ఎకరం కాదు రెండు ఎకరాలు కాదు ఏకంగా ఆరు ఎకరాల పంటను నకిలీ మందులు నట్టేట ముంచాయని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామానికి చేబర్తి బాల పోచయ్య తనకున్న రెండు ఎకరాలతోపాటు 8 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని యాసంగిలో వరి సాగు చేశారు. కెనాల్ కాల్వ, బోర్ల ద్వారా పంటకు సాగునీరు పెడుతూ పంటను కాపాడుకుంటున్నాడు. కాగా వరి పంట ఎర్రబడుతుందని, పొట్ట సమయంలో దోమ కాటు నివారణ కోసం గజ్వేల్‌లోని శ్రీనిధి ట్రేడర్స్‌లో రూ.4,050 చెల్లించి ట్రెండ్, అచిబు వరి మందులను తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆరు ఎకరాల వరి పంటకు పిచికారీ చేశారు. బుధవారం ఉదయం వరి పంటను చూసేసరికి ఎండుముఖం పట్టింది. దీంతో సదరు రైతు చేతికొచ్చే సమయంలో వరి ఎండిపోవడంతో ఆందోళనకు గురి అయ్యారు. వెంటనే మందులు కొనుగోలు చేసిన డీలర్‌కు సమాచారం అందించారు. పంటను చూసి సదరు మందుల కంపెనీ దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టినట్లు రైతు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

హనుమంతోత్సవ వైభవం

- నాచగిరిలో ఆధ్యాత్మిక పరిమళం
- సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించిన శ్రీమాధవానంద సరస్వతీ


హనుమత్ వాహనంపై నాచగిరీశుడు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రంలో వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హనుమంతోత్సవ సేవ వైభవంగా జరిగింది. విశేషాలంకృతమైన హనుమత్ వాహనంపై శ్రీలక్ష్మీనారసింహులు అధిష్ఠించారు. భక్తజన హర్షధ్వానాల మధ్య ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ ఈఓ పార్నంది విశ్వనాథశర్మ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. అలాగే, నాచగిరి క్షేత్రంలో ధార్మిక, సంగీత, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు తెరలేచింది. బుధవారం సాయంత్రం పీఠాధిపతి శ్రీమాధవానంద స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ధార్మిక కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఈఓ విశ్వనాథశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారు భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. వర్గల్ వేదపాఠశాల విద్యార్థుల సామూహిక వేదపఠనంతో సాంస్కృతిక కార్యక్రమాల సందడి మొదలైంది.


సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభిస్తున్న శ్రీమాధవానంద సరస్వతీ